



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్ కుమార్ సింగ్

వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్ మే 20 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి, మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఆరోగ్యశ్రీ బ్లాక్, యూరాలజీ బ్లాక్, జనరల్ వార్డు, ఆస్పత్రి పరిసరాలు, హాస్పటల్ ఇన్ పేషేంట్, ఔట్ పేషేంట్, వైద్యులు, సిబ్బంది హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలను సూపరిండెంట్ శ్రీనివాస్, ఆర్‌ఎంవో జగదీష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇందిరా మహిళాశక్తి క్యాంటిన్ల ద్వారా స్వచ్ఛమైన పదార్థాలను అందించాలన్నారు. పార్కింగ్, వైద్య విభాగాలు, శానిటేషన్ నిర్వాహణ తదితర అంశాలపై తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో మధుసూదనరాజు పాల్గొన్నారు.

ఇందిర సౌర గిరి జలవికాస పథకం అమలుకు చర్యలు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిర సౌర గిరి జలవికాసం పథకం అమలుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఇందిర సౌర గిరి జలవికాసం పథకంపై అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రిప్ ఇరిగేషన్ ద్వారా వ్యవసాయం సాగులోకి తీసుకుచ్చి రైతు సమగ్రాభివృద్ధికి దోహదపడేలా చేయడం ఈ పథకం ఉద్దేశమని చెప్పారు. ప్రభుత్వ సూచనల ప్రకారం క్షేత్రస్థాయిలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి అర్హులైన ప్రతీ ఒక్కరికి అందేలా ప్రణాళికలు రూపొందించి ముందుకు సాగాలన్నారు. ఐటీడీఏ పీడీ చిత్రామిశ్రా మాట్లాడుతూ ఇందిర సౌర గిరి జలవికాస పథకం గిరిజన రైతుల అభివృద్ధి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. బయ్యారం, గంగారం, గార్ల, గూడూరు, కేసముద్రం, కొత్తగూడ, కురవి, నెల్లికుదురు, మానుకోట మండలాల్లో ప్రత్యేక సభల ద్వారా ఆసక్తి కలిగిన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో డీఎఫ్‌వో విశాల్, జిల్లా అధికారులు మధుసూదన రాజు, పురుషోత్తం, దేశీరామ్, వేముల సురేష్, నరేష్, మరియన్న, రాజ్‌కుమార్, వెంకన్న, వీరభద్రం, ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ పథకాలను యువత సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ తన చాంబర్‌లో మంగళవారం జిల్లా పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ టీ ప్రైడ్ స్కీం ద్వారా జిల్లాలోని ఎస్టీలు 54 మందికి రూ.1.75కోట్లు, ఎస్సీ నలుగురికి 14.65లక్షలు, మొత్తంగా 1.89కోట్ల నిధుల కేటాయింపు కోసం కమిటీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం 58మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సబ్సిడీ రాయితీ మంజూరు చేయడం జరిగింద న్నారు. తెలంగాణ ఐపాస్ ద్వారా 28యూనిట్లు 30.7కోట్ల పెట్టుబడులతో అనుమతులు పొందాయని, మానుకోట, కేసముద్రం మండలాల్లో రైస్ మిల్లులు స్థాపిం చేందుకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. సమావేశంలో అధికారులు శ్రీమన్నారాయణ, దేశీరాం, శ్రీనివాసరావు, మూర్తి, రజిత, సాయిరాం, వెంకటరమణ పాల్గొన్నారు.



కాంగి'రేసు'లో.. సందడే.. సందడి

- సంస్థాగత పదవుల కోసం పోటా పోటీ
- దశాబ్దకాలం తర్వాత పార్టీలో జోష్
- కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

మహబూబాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి) : సంస్థాగత పదవుల కోసం కాంగి'రేసు'లో హోరాహోరీ తలపడుతున్నారు. స్వరాష్ట్రం సిద్ధించాక అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటూ దశాబ్దకాలం పాటు అధికారానికి దూరమైన కాంగ్రెస్ పార్టీ పునర్వైభవం పొందిన తర్వాత తొలిసారిగా.. పార్టీ సంస్థాగత ఎన్నికలకు దరఖాస్తుల స్వీకరణ ఆరంభమై చివరి దశకు చేరుకుంది. పూర్తిస్థాయి నియోజకవర్గాలైన మహబూబాబాద్, డోర్నకల్‌తో పాటు రెండేసి మండలాల ప్రాతినిధ్య పాలకుర్తి, ములుగు, ఇల్లందు నియోజకవర్గాల పరిధితో ఉన్న మహబూబాబాద్ జిల్లాకు పార్టీ పరిశీలకులుగా పోట్ల నాగేశ్వర్‌రావు, రవళిరెడ్డిలు నియామకమైన వెంటనే సంస్థాగత పదవులను ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు.

గత 10 రోజులుగా మహబూబాబాద్ జిల్లాలోని వివిధ మండలాల్లో పర్యటిస్తున్న ఈ నేతలు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ముమ్మరం చేశారు. గ్రామస్థాయి కమిటీలను మొదలుకుని మండలాలు, బ్లాక్‌స్థాయి కమిటీలతో పాటు మునిసిపాలిటీ పరిధుల్లో వార్డు కమిటీలు, అర్బన్ కమిటీల నుంచి దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో ఆయా నియోజకవర్గాల ప్రాతినిధ్య శాసనసభ్యులు అంటీముట్టన్నట్లుగానే వ్యవహరి స్తున్నప్పటికీ అంతర్గతంగా తమ నమ్మిన బంట్లను దరఖాస్తులు చేసుకోమ్మని ముందస్తు గానే సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

గాడ్‌ఫాదర్‌లతో ప్రయత్నాలు..

సంస్థాగత ఎన్నికల కాంగి'రేసు'లో అనూహ్య రీతిన పోటీ కన్పిస్తోంది. గ్రామ కమిటీలతో పాటు మండల కమిటీలు, బ్లాక్ కమిటీ, మునిసిపాలిటీల పరిధిలో అర్బన్ కమిటీల అధ్యక్ష పదవులను దక్కించుకునేందుకు ముఖ్యనేతలు ఎవరికి వారే తమ గాడ్‌ఫాదర్‌ల వద్ద ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ పదవులు దక్కితే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా కమిటీల పరిధిలో చక్రం తిప్పవచ్చనే దూర ఆలోచనతో ఆశావహులు రంగంలో దిగుతున్నట్లు తెలుస్తోంది. కొందరైతే తమతో గట్టిపోటీ ఇస్తున్న వారిని తప్పించేందుకు అగ్రనేతలతో ఫోన్‌లు చేయించే ప్రయత్నాలు కూడా చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు అనివార్యమైతే ఏం చేయాలనే ఆలోచన కూడా ఇప్పట్నుంచే చేస్తున్నట్లు తెలుస్తోంది. పూర్వంలో వివిధ పదవులను అలంకరించి రాజ్యమేలిన ముఖ్యనేతలు మళ్లీ ఆ పట్టును నిలబెట్టుకునేందుకు సకల శక్తులు ఒడ్డుతున్నట్లు తెలుస్తోంది. సంస్థాగత పదవులు తప్పితే ఇక తమకు ఆయా గ్రామాలు, మండలాలు, బ్లాక్‌ల పరిధిలో తమ ఆటలు సాగవని భావిస్తున్న కొందరు నేతలు ఎలాగైనా పదవులను దక్కించుకోవాలని ఏ చిన్న అస్త్రాన్నీ వదలకుండా ప్రయత్నిస్తున్నట్లు చెబుతున్నారు.

జోష్‌లో కాంగ్రెస్ అధిష్ఠానం..

జిల్లాలో మునుపెన్నడు లేని రీతిలో సంస్థాగత ఎన్నికల్లో గ్రామస్థాయి మొదలుకుని మండల, బ్లాక్, మునిసిపాలిటీల్లో వార్డు, అర్బన్ అధ్యక్షుల పదవులకు విపరీతమైన పోటీ ఉండడంతో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇది మంచి పరిణామమని భావిస్తోంది. కాంగ్రెస్ పార్టీకి పెరిగిన క్రేజీకి ఇది నిదర్శనమని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే స్ఫూర్తితో పార్టీ అభ్యర్థులు దాదాపు మెజార్టీ స్థానాల్లో విజయం సాధిస్తారని విశ్వసిస్తోంది. అందుకే గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆచీ... తుచీ.. అధ్యక్ష పదవుల ఎంపిక చేయాలని పార్టీ పరిశీలకులు అధిష్ఠానానికి నివేదించనున్నట్లు ముఖ్యనేతలు చెబుతున్నారు. త్వరితగతిన సంస్థాగత ఎన్నికల ప్రక్రియను పూర్తిచేస్తే ఆపై పార్టీ రహిత గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచులు, వార్డు సభ్యుల ఎంపిక కూడా ముందస్తుగానే చేసుకునే అవకాశం ఉంటుందని ద్వితీయ శ్రేణి నాయకులు ప్రజాప్రతినిధులకు నివేదిస్తున్నట్లు తెలుస్తోంది. ఇవన్నీ ముందస్తుగా సర్దుకుంటేనే ఆపై ఎంపీటీసీలు, జడ్పీటీసీల అభ్యర్థుల ఎంపిక కూడా సులువు అవుతుందని చెబుతున్నారు. ఇక మునిసిపాలిటీల విషయానికొస్తే మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ, తొర్రూరులో ఇదివరకు ఎన్నికలు జరిగిన దరిమిలా అక్కడ కాంగ్రెస్‌తో పాటు ప్రధాన ప్రతిపక్షాలు ఇప్పట్నుంచే రిజర్వేషన్‌లను అంచనా వేసుకుంటూ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి.

కొత్తగా ఏర్పాటైన కేసముద్రం మునిసిపాలిటీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపితే ఆవిర్భావ తొలి ప్రాతినిధ్యాన్ని దక్కించుకోవచ్చని ఆ పార్టీ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. మొత్తానికి కాంగ్రెస్ సంస్థాగత ఎన్నికల్లో అభ్యర్థుల పోటీ జోష్ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు తాము సిద్ధమన్న సంకేతాలను తెలియజేస్తోంది.

పెళ్లింట పెను విషాదం



విద్యుదాఘాతంతో నవ వరుడి మృతి

- అపస్మారకస్థితిలో నవవధువు
- కోడిపుంజల తండాలో తీవ్ర విషాదం



నరేష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

బయ్యారం, మే 20 (ఆంధ్రజ్యోతి) : పెళ్లికి వచ్చిన బంధువుల సందడి.. కాసేపట్లో రిసెప్షన్ ప్రారంభం.. నూతన వధూవరులు స్టేజీ ఎక్కనున్నారు.. అందుకు సంబంధించిన ఏర్పాట్లలో కుటుంబికులు.. వచ్చిన చుట్టాల హడావిడి.. ఈ సంబురంలో పెళ్లికుమారుడు నీటి పంపు మోటారు ఆన్‌చేస్తుండగా.. విద్యుత్ ఘాతానికి గురై దుర్మరణం చెందాడు. దీంతో ఆ పెళ్లి కుమారుడి మృతితో ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. వివాహమైన 48 గంటల్లోపే విద్యుదాఘాదంతో పెళ్లి కొడుకు మృతి చెందగా.. పెళ్లి కూతురు అపస్మారకస్థితిలోకి వెళ్లిన ఘటన మంగళవారం కోడిపుంజుల తండాలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

కోడిపుంజుల తండాకు చెందిన ఇస్లావత్ బాలు-కౌసల్య దంపతులకు ఇరువురు కుమారులు గణేష్, నరేష్ ఉన్నారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం బాలు కుటుంబం జీవనోపాధి నిమిత్తం హైదరాబాద్ వలస వెళ్లారు. అక్కడ బాలు చిన్న కుమారుడు నరేష్ (26) కారు నడుపుతూ జీవనం సాగిస్తుండగా, పెద్ద కుమారుడు గణేష్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, నరేష్‌కు ఈనెల 18వ తేదీన ఆదివారం రాత్రి కృష్ణా జిల్లా కంకిపాడు మండలం గొడవర్రు గ్రామంలో బి. రమేష్-శాంతి దంపతుల కూతురు జాహ్నవి ప్రియతో వివాహం జరిగింది. అనంతరం మంగళవారం కోడిపుంజుల తండాలోని నరేష్ ఇంటి వద్ద రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే రిసెప్షన్‌కు సంబంధించిన పనుల్లో భాగంగా నీటి కోసం ఇంట్లోని కరెంట్ మోటార్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాదంతో పెళ్లి కొడుకు నరేష్ మృతి చెందాడు. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే నరేష్ మృతి చెందినట్లుగా వైద్యులు పేర్కొన్నట్లు తెలిసింది. కాగా, నరేష్ విద్యుత్ షాక్‌కు గురవడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిన పెళ్లి కూతురు జాహ్నవి ప్రియను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యు లు ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. పచ్చని పెళ్లి పందిరి సాక్షిగా నవవరుడు మృతి చెందటంతో కోడిపుంజుల తండాలో తీవ్ర విషాదం నెలకొన్నది. కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. మృతుడి అన్న గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు బయ్యారం ఎస్సై తిరుపతి పేర్కొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి..

- గంధంపల్లిలో ఘటన



జంగిలి సతీష్ (ఫైల్)

బయ్యారం, మే 20 (ఆంధ్రజ్యోతి) : తన కూతురి పెళ్లి పనులకు తిరిగి, వడ దెబ్బకు గురైన ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన మంగళవారం గంధంపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. గంధంపల్లి గ్రామానికి చెందిన జంగిలి సతీష్-శోభ దంపతులకు ఇరువురు కుమార్తెలు అక్షయ, శ్రావణిలు న్నారు. సతీష్ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే సతీష్ (45) తన చిన్న కూతురైన అక్షయను ఖమ్మం జిల్లా ముత్తగూడెం గ్రామానికి చెందిన మోహన్‌రావు, వెంకటమ్మల కుమా రుడు వాసుకు ఇచ్చి ఈ నెల 18న గంధంపల్లిలో ఆనందంగా వివాహం జరిపిం చాడు. అయితే పెళ్లికి సంబంధించిన పనుల నిమిత్తం ఎండలో తిరిగిన సతీష్ రెండు, మూడు రోజులుగా వాంతులు, వీరోచనాలతో బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు తొలుత స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించినప్పటికి ఫలితం లేకపోవడంతో మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స చేయించారు. ఈ క్రమంలోనే మంగళవారం మధ్యాహ్నం వాంతులు, వీరోచనాలు తగ్గుముఖం పట్టినట్లు అనిపించడంతో సతీష్ ఆస్పత్రి నుంచి డిచార్జ్ అయి ఇంటికి వచ్చాడు. ఇంటికి వచ్చిన కొద్ది సేపటికే మళ్లీ వాంతులు, వీరోచనాలు అవు తుండటంతో కుటుంబసభ్యులు తిరిగి మహబూబాబాద్ తీసుకెళ్తుండగాసతీష్ మృతి చెం దినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. కాగా, మృతుడి తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.



పుష్కరిణికి సారె బహూకరిస్తున్న భక్తులు



త్రివేణి సంగమం వద్ద నవరత్న హారతి ఇస్తున్న కాశీ పండితులు



పుష్కర సరస్వతీ పాహిమాం..

కాళేశ్వరంలో కొనసాగుతున్న భక్తుల తాకిడి



- ఆరో రోజు 50వేల మంది పుణ్యస్నానాలు
- స్వామివారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు
- కొంత మేరకు తగ్గిన ట్రాఫిక్.. సాఫీగా దర్శనాలు..
- నిరంతరం పర్యవేక్షిస్తున్న భూపాలపల్లి కలెక్టర్, ఎస్పీ



7



నదిలో పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తులు

వడ్ల కొనుగోలు కేంద్రాలకు కంట్రోల్ రూం ఏర్పాటు
రైతులకు అందుబాటులో టోల్ నెంబర్ : 79950 50789

8

రూ.50 వేలు ఇవ్వనందుకు.. చితకబాదారు!

- గూడూరు ఎస్సైపై బాధితుడు ప్రశాంత్ ఆరోపణ
- జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు



జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రశాంత్

నెహ్రూసెంటర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : బెల్లం అక్రమ రవాణా కేసులో రూ.50 వేలు ఇవ్వనందుకు ఓ యువకుడిని గూడూరు ఎస్సై గిరిధర్‌రెడ్డి చితకబాదిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు అంగోత్ ప్రశాంత్ కథనం ప్రకారం. గూడూరు మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన అంగోతు ప్రశాంత్ ఈనెల 16న రాత్రి మహబూబాబాద్ మండలం వేంనూరు నుంచి గోవిందాపురానికి తన ద్విచక్రవాహనంపై బెల్లం బస్తా వేసుకుని వెళ్తున్నాడు. గోవిందాపురం వద్ద ఎస్సై గిరిధర్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో తనిఖీలు చేస్తుండగా, అటుగా వచ్చిన తనను పట్టుకుని బెల్లంను, ద్విచక్రవాహనంను స్వాధీనం చేసుకున్నారు. ఆపై తన వద్దఉన్న రూ.30 వేల నగదును సైతం తీసుకున్నారని బాధితుడు ప్రశాంత్ ఆరోపించారు. మరుసటిరోజు శనివారం గూడూరు ఎస్సై పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు తనతో చెప్పారని పేర్కొన్నాడు. సోమవారం మళ్లీ తనకు స్వయంగా ఎస్సై ఫోన్‌చేసి నీ ద్విచక్రవాహనం తీసుకుపోయేందుకు స్టేషన్‌కు రావాలని చెప్పినట్లు ప్రశాంత్ తెలిపాడు. స్టేషన్‌కు వెళ్లిన తనను రూ.50 వేలు డిమాండ్ చేశారని, అవి ఇవ్వనందుకు తనను చితకబాదినట్లు బాధితుడు ప్రశాంత్ ఆరోపించాడు. ఎస్సై తనను చితకబాదడం ద్వారా అస్వస్థతకు గురై జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు బాధితుడు తెలిపాడు. కాగా, ఉన్నతాధికారులు చొరవ చూపి గూడూరు ఎస్సైపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని ప్రశాంత్ వేడుకున్నాడు. ఈ విషయంపై గూడూరు ఎస్సై గిరిధర్ రెడ్డిని వివరణ కోరగా.. బెల్లం అక్రమ రవాణా కేసు నుంచి తప్పించుకునేందుకు అంగోతు ప్రశాంత్ తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడని చెప్పారు. ప్రశాంత్ అక్రమంగా బెల్లం రవాణా చేస్తుంటే ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామే తప్ప అతనిపై చేయి చేసుకోలేదని వివరణ ఇచ్చారు.

మా భూమిలో అర్బన్ పీహెచ్‌సీ నిర్మించొద్దు

- మానుకోటలో పెట్రోల్ బాటిళ్లతో మహిళల ఆందోళన



తమ భూమిలో అర్బన్ పీహెచ్‌సీని నిర్మిస్తున్నారంటూ పెట్రోల్ బాటిళ్లతో ఆందోళన చేస్తున్న మహిళలు



ఆందోళన చేస్తున్న మహిళలతో మాట్లాడుతున్న టౌన్ ఎస్సై విజయ్

మహబూబాబాద్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): తమ భూమిలో అర్బన్ పీహెచ్‌సీ భవన నిర్మాణం చేపట్టవద్దంటూ మంగళవారం ఇరువురు మహిళలు చుక్కల పద్మ, కొడెల లక్ష్మి పెట్రోల్ బాటిళ్లతో ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న టౌన్ ఎస్సై విజయ్ అక్కడకు చేరుకుని వారికి నచ్చజెప్పి, ఆందోళనను విరమించారు. వివరాల్లోకి వెళితే.. మహబూబాబాద్ పట్టణానికి చెందిన చుక్కల పద్మ వేల్పుల సత్యంనగర్ కాలనీ డబుల్ బెడ్ రూమ్ కాలనీకి వెళ్లే మార్గంలో 287/1 సర్వే నెంబరులో 2002 సంవత్సరంలో 600 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. పద్మ పక్కన మరో మహిళా కొడెల లక్ష్మి 400 గజాల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేశారు. అయితే ఇటీవల కాలంలో అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో ఆ భూమి ప్రభుత్వ స్థలమని అధికారులు అర్బన్ పీహెచ్‌సీకి కేటాయించారు. అందులో భవన నిర్మాణాలు చేస్తుండగా, అది తమ భూమి అని, అందులో నిర్మాణాలను ఆపాలని ఇరువురు మహిళలు చుక్కల పద్మ, కొడెల లక్ష్మి పెట్రోల్ బాటిళ్లతో ఆందోళనకు దిగారు. అక్కడ నిర్మాణాలు చేపడితే తాము పెట్రోల్ పోసుకుని ఆత్మహ త్యకు పాల్పడుతామని హెచ్చరించారు. తాము కష్టపడి భూమిని కొనుగోలు చేశామని, అది పోతే ఇక తమకు ఆ త్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విష యంపై గతంలో అనేక మార్లు ప్రజాప్రతినిధులు, అధికారు లకు మొర పెట్టుకున్నప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. తమ భూమిలో నిర్మాణాలు ఆపి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న టౌన్ ఎస్సై విజయ్ అక్కడకు చేరుకుని వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు ఉంటే తీసుకురావాలని వాటిని అధికారులు పరిశీలిస్తారని చెప్పడంతో వారు శాంతించారు.

డీఎస్‌టీ నిబంధనల మేరకే నిర్వహణ

టీజీ కాస్ట్ సభ్య కార్యదర్శి ● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

హనుమకొండ కలెక్టరేట్, మే 20 (ఆంధ్రజ్యోతి): భారత శాస్త్ర, సాంకేతిక శాఖ(డీఎస్‌టీ) నిబంధనల మేరకే హనుమకొండ హంటర్‌రోడ్‌లోని సైన్స్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఎస్సీ, ఎస్టీసెల్ ప్రాజెక్టు నిర్వహణ జరుగుతుందని, ఇందులో ఎలాంటి అక్రమాలకు తావులేదని టీజీకాస్ట్ సభ్య కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17,18తేదీలలో 'ఆంధ్రజ్యోతి'లో సైన్స్ సెంటర్‌పై ప్రచురితమైన వరుస కథనాల నేపథ్యలో టీజీకాస్ట్ సభ్య కార్యదర్శి ఈ ప్రకటన ద్వారా వివరణ ఇచ్చారు. 3 ఏళ్ల కాల వ్యవధికి ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా 10వేల ఎస్సీ కుటుంబాలు, 8వేల ఎస్సీ కుటుంబాలను సర్వే చేశామని, ఆయా కుటుంబాల జీవనోపాధి, విద్య, ఆరోగ్యం సంప్రదాయ కార్యకలాపాలపై సేకరించిన అంశాలను సెస్, టిస్‌లు సర్వే రిపోర్టులు సమర్పించాయన్నారు. డీఎస్‌టీ నిబంధనల ప్రకారమే క్షేత్రస్థాయి సర్వేకు ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న సిబ్బందిని పంపించామన్నారు. ప్రమాద ఖర్చుల చెల్లింపులో ఎలాంటి అవకతవలు జరగలేదన్నారు. మిగిలిన పనులను పూర్తిచేయడంతో పాటు ప్రాజెక్టు కాలపరిమితి పెంపునకు డీఎస్‌టీ జీఓఐను కోరామన్నారు. ప్రాజెక్టు అమలు మొత్తం జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జరిగిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


రాములు

చెన్నారావుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి చెందారు. స్థానికులు, ట్రైనీ ఎస్సై చిలువేరు రోహిత్ కథనం ప్రకారం.. చెన్నారావుపేటకు చెందిన మర్రి రాములు (65) సైకిల్‌పై వెళ్లి పాల బాటిళ్లను ఇచ్చి ఇంటికి వస్తున్నాడు. అదేసమయంలో నర్సంపేట నుంచి నెక్కొండకు వస్తున్న టాటాఏస్ సెంటర్ వద్ద ఎదురుగా ఢీకొట్టింది. సైకిల్‌పై ఉన్న రాములు రోడ్డుపై పడి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్‌ను గ్రామస్థులు పోలీసులకు అప్పగించారు. రాములుకు భార్య సమ్మక్క, ఒక కుమారుడు రాజు, ఒక కుమార్తె ఉంది. కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్సై వివరించారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య


రంజిత్

నెక్కొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిట్టకాలుబోడు గ్రామానికి చెందిన బానోత్ రంజిత్ (28) జీవితంపై విరక్తి చెంది మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ మంగళవారం తెలిపారు. రంజిత్ తన కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లో ఉంటూ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఆరు నెలల కిందట రంజిత్ భార్య ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయంలో రంజిత్ జైలుకు వెళ్లి వచ్చాడు. ప్రస్తుతం పిట్టకాలుబోడులో ఉంటున్నాడు. మానసిక ఒత్తిడితో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో ఈ నెల 18న గడ్డిమందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ 19న రాత్రి మృతి చెందాడు. మృతుడి అన్న బానోత్ రవి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. రంజిత్‌కు 10, 8 ఏళ్లున్న ఇద్దరు కుమారులు ఉన్నారు.



WANTED
★ Wated Teachers to Teach Pre-Primary, Primary, all Sub 6th to10th all sub; VP(Eng), Eng fluency is must, wardens F/M, Cooks AVSHS, Dharmaram, Wgl. Contact : 9848672108, 9848181976
AJW-237370

WANTED TEACHERS
★ Wanted Teachers to Teach all Subjects From Nur-X Class. Candidates must be Experienced & English Background, Ratnam High School, Rangasaipet, Wgl. Cell.No : 9441412898
AJW-237367

WANTED
★ B.Sc నర్సింగ్ & GNM సిస్టర్స్, EMT and అనెస్తీషియా టెక్నీషియన్లు, సిస్టమ్ ఆపరేటర్లు, వార్డ్ బాయ్స్, ఆయాలు కావలెను. సం॥ప్ర॥ 9703377036, 7702686277
AJW-7656

WANTED
★ హస్పిటల్‌లో పనిచేయడానికి అనుభవం గల వాచ్‌మెన్ (భార్య మరియు భర్త) కావలెను. రూమ్ మరియు జీతం : 10వేలు ఇవ్వబడును. సం॥ప్ర॥ 8341984898, 9849029659
AJW-4091

WANTED
★ హన్మకొండలో గల ప్రముఖ హాస్పిటల్‌లో పనిచేయుటకు అనుభవం గల GNM ఫార్మసిస్ట్ మరియు మల్టిపర్పస్ మేనేజర్ (MBA) కావలెను. సం॥ప్ర॥ 8712608501, 9966068880
AJW-4093

ఆఫీస్ అసిస్టెంట్ కావలెను
★ సెక్యూరిటీ గార్డుగా అనుభవం గల ఆఫీస్ అసిస్టెంట్ వెంటనే కావలెను, స్వంత వాహనం కలవారు, మరియు సెక్యూరిటీ గార్డ్సు కావలెను జీతం : 10,000 నుండి 15,000 + ESI, EPF. సం॥ప్ర॥ 9848022608, 8978459111.
AJW-516

సెక్యూరిటి గార్డ్స్ కావలెను
★ వర్ధన్నపేట, మహబూబాబాద్, నర్సంపేట్, ములుగు, చేర్యాల, జనగాం, వరంగల్, హంటర్ రోడ్, పాలకుర్తి, మంగపేట్, భూపాలపల్లి ఏరియాలలో సెక్యూరిటీ ఫీల్డ్ ఆఫీసర్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ Female TeleCallers కావలెను, మంచి వేతనం ఇవ్వబడును. సం॥ప్ర॥ 7386322260, 9100725914
AJW-237366

కావలెను
★ హన్మకొండ స్వచ్ఛంద సంస్థ నందు వాచ్‌మెన్ కావలెను. ఉచిత వసతి + భోజనం కల్పించబడును. సం॥ప్ర॥ 8074465703, 9849038142
AJW-15652

కావలెను
★ డిగ్రీ లేదా పీజీ పూర్తి చేసిన యువతి/యువకులకు రామప్ప కళాశాల విద్యార్థులను స్టడి అవర్‌లు మరియు కళాశాల మెయింటెనెన్స్ కోసం పురుషులు వార్డెన్లు (12) స్త్రీ వార్డెన్లు (4), ట్యూటర్లు (8) కావలెను. జీతంతో పాటు ఉచిత వసతి మరియు భోజనం కల్పించబడును. సం॥ప్ర॥ 6301274545.
AJW-15797

కావలెను
★ హనుమకొండలో గల రామప్ప కళాశాల నందు కిచెన్ మరియు హాస్టల్లో పనిచేయుటకు భార్యభర్తలు (4) మరియు మగవారు (2) ఆడవారు (6) కావలెను. జీతంతో పాటు వసతి కల్పించబడును. సం॥ప్ర॥ 9985211479, 9603847184.
AJW-15797

KUDA అప్రూవ్డ్ ప్లాట్స్
★ KUDA అప్రూవ్డ్ లే-అవుట్ రెసిడెన్సియాల్ ప్లాట్స్ ఎడ్యుకేషన్ కారిడార్ ఎల్కతుర్తి NH-563 ఫేసింగ్ ప్రపోస్డ్ IIIT క్యాంపస్, సబ్ కోర్టు ప్రక్కన అభివృద్ధి చేయబడిన వెంచర్‌లో ఈరోజు బుక్ చేసుకోండి మంచి ఇన్వెస్ట్మెంట్, వెంటనే ఇల్లు కట్టు కోవడానికి వివరలకు సం॥ప్ర॥ 9949732488.
AJW-6621

HOUSE FOR SALE
★ హన్మకొండ, గోపాలపూర్, విజయనగర్ కాలనీ, రోడ్ నెం-2 సందీప్ సూపర్ మార్కెట్ ఎదురుగా 2 BHK, 300 Sq.Yds ఇల్లు అమ్మబడును. సం॥ప్ర॥ 7702527759
AJW-237319

TUITIONS
★ Diploma, B. Tech & Degree (Regular/ Supply) Students. Advance Classes for B. Tech, Inter, Home Tuition also Available Kaleshwari Institute, Wgl. cell : 8125080314, 9032857572.
AJW-237316

CHANGE OF NAME
★ I, GUDELLI DIVYA REDDY (Old Name) H.No: 1-7-946/A, Advocate Colony Hanamakonda (M& Dist). 506001. T.G. I Have Chnaged my Name from GUDELLI DIVYA REDDY to GUDELLI DIVYA (New Name) for all purposes.
AJW-237371

CHANGE OF NAME
★ I, DASARI SPHURTHY D/o. SATYA RAJKUMAR DASARI (Old Name) H.No: 1-9-511/2, BasithNagar, Julywada, Hanamakonda, Dist. 506001. T.G, I Have Changed my Name from DASARI SPHURTHY to DASARI SPURTHY (New Name) for all purposes
AJW-237371

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడిఏటి

ప్రతి నాలుగు లైన్ల క్లాసిఫైడ్ ప్రకటనకు రూ. 250/- మాత్రమే.
అదనపు లైనుకు రూ. 45/-
గమనిక : మీరు ఇచ్చే ప్రతీ ప్రకటనలకు 5% GST అదనంగా చెల్లించవలెను.

ప్రకటనల కొరకు సంప్రదించండి
హన్మకొండ
9985400013
8978510273
9985411677
9985411676
వరంగల్
9985406150
9985408173
జనగామ
9866431354
మహబూబాబాద్
9985418040
తొర్రూర్
9985418040
నర్సంపేట
9985418040
భూపాలపల్లి
9985401232
పరకాల
9985401232


పరిపాలనా భవనం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు


పరీక్షల తీరును పరిశీలిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

నిరసనల మధ్య పీజీ పరీక్షలు ప్రారంభం

● వాయిదా వేయాలని విద్యార్థుల ఆందోళనలు ● క్యాంపస్‌లో పోలీసుల పహారాతో పరీక్షల నిర్వహణ

కేయూ క్యాంపస్ మే 20, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీతో పాటు ఇతర పీజీ కోర్సుల అఖరు సెమిస్టర్ పరీక్షలు రసాభాసా మధ్య ప్రారంభమయ్యాయి. సోమవారం రాత్రి పరీక్షలను వాయిదా వేయాలని విద్యార్థులు కేయూ మొదటి గేటు వద్ద నిరసన ఆందోళనలు చేపట్టారు. నిరసన చేపట్టిన విద్యార్థులను పోలీసులు అడ్డుకుని వర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మంగళవారం ఉదయం అల్పాహార సమయంలో విద్యార్థులందరూ తమ పరీక్షలను వాయిదా వేయాలని మళ్లీ ఆందోళనకు దిగారు. కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డిని కలిసి తమ బాధలను చెబుతామంటూ నిరసనకు దిగిన విద్యార్థులను పోలీసులు అడ్డుకున్నారు. పరిపాలన భవనం ఎదుట పోలీసులు మోహరించి విద్యార్థులను అక్కడ నిరసన చేపట్టకుండా అడ్డుకున్నారు. దీంతో విద్యార్థులు వీసీ లాడ్జ్ వద్దకు చేరుకున్నారు. వీసీ రావాలంటూ నిరసన చేపట్టారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో వీసీ ప్రతాప్‌రెడ్డి విద్యార్థులకు నచ్చచెప్పి పరీక్షలు రాయాలని సూచించారు. దీంతో విద్యార్థులు శాంతించారు. పరిపాలన భవనం వద్ద నిరసన చేపట్టిన విద్యార్థులను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, కేయూ పాలనమండలి సభ్యులు, లా కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ బి.సురేశ్‌లాల్ విద్యార్థులకు నచ్చ చెప్పారు.

పరిపాలన భవనం వద్ద స్వల్ప తోపులాట

వర్సిటీలో సోమవారం రాత్రి నుంచి విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు వర్సిటీలో భారీగా మోహరించారు. పరీక్షలు వాయిదా వేయలంటూ విద్యార్థులు.. యథావిధిగా నిర్వహిస్తామని అధికారులు ప్రకటించడంతో వర్సిటీలో తీవ్ర ఉత్కంఠ కొనసాగింది. మంగళవారం ఉదయమే పరిపాలన భవనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని అక్కడకు వచ్చి నిరసన చేపట్టేందుకు ప్రయత్నించిన విద్యార్థులను అడ్డుకున్నారు. పరిపాలన భవనం ఎదుట మహిళ పోలీసులకు, విద్యార్థులకు మధ్య స్వల్పతోపులాట చోటుచేసుకుంది. విద్యార్థులను పోలీస్ వ్యాన్ ఎక్కించేందుకు ప్రయత్నించగా విద్యార్థులు మూకుమ్మడిగా అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులు దురుసుగా ప్రవర్తించారని విద్యార్థులు ఆరోపించారు.

పరీక్షల తీరును పరిశీలించిన వీసీ, రిజిస్ట్రార్

కాకతీయ యూనివర్సిటీలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగిన పరీక్షల నిర్వహణతీరును కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి బీఎస్‌ఎల్ సౌజన్య, క్యాంపస్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.మమత పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

మూడు రోజుల పాటు జీవవైవిధ్య కార్యక్రమాలు

- రేపటి నుంచి 25వ తేదీవరకు నిర్వహణ
- బైక్ ర్యాలీ, అటవీ ఉత్పత్తుల సంత, పిచ్చుక గూళ్ల పంపిణీ
- 24, 25న అడవిలో బస, నడక

హనుమకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 22న బైక్ ర్యాలీని నిర్వహించనున్నారు. పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక, ఏడబ్ల్యుఎల్ఎస్, వీఎస్ఎస్, గ్రామ భారతి, జనవిజ్ఞాన వేదిక, ప్రేరణ విద్యా వికాస, సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో చేపట్టనున్న ఈ ర్యాలీని గురువారం ఉదయం 5.45 గంటలకు సుబేదారిలోని అటవీశాఖ కార్యాలయం నుంచి ప్రారంభమై ధర్మసాగర్ మండలం దేవునూరు ఇనుపరాతి గట్టు అటవీ ప్రాంతం వరకు సుమారు 20 కి.మీ. సాగుతుంది. తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు కొనసాగుతుంది. అలాగే గ్రామ భారతి, సెంటర్ ఫర్ పీపుల్స్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో దేశీ విత్తనాలు, అటవీ ఉత్పత్తులు, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల సంత ఏర్పాటు ఉంటుంది. పాముల పరిరక్షణపై అవగాహన, జీడబ్ల్యుఎంసీ, డీఆర్‌డీవో కిందటేడు నాటిన మొక్కల ప్రథమ జన్మదినోత్సవం, కొత్త మొక్కలను నాటడం, ప్రేరణ విద్యా వికాస సంస్థ బట్ట సంచులు, చింతగట్టు గోశాల పిచ్చుక గూళ్ల ఉచిత పంపిణీ ఏడబ్ల్యుఎల్ వన్యప్రాణి ఛాయాచిత్ర గ్యాలరీ, అటవీ శాఖ (పరిశోధన) మొక్కల సేంద్రియ, వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ ప్రేమికులు, కార్యకర్తలు, ఔత్సాహికులు ఈ కార్యక్రమాలకు హాజరుకావాలని పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం కోరారు.

మరిన్ని వివరాలకు 8328026266, లేదా 9948609591 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు. ఈనెల 24న ఉదయం 6 నుంచి 8 గంటల వరకు జీవవైవిధ్య దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 24 సాయంత్రం అడవిలో బస, 25న ఉదయం 6 నుంచి 8 గంటల వరకు అడవిలో నడక, వన్య సందర్శన నిర్వహిస్తారు. ఇందులో పాల్గొనడానికి మొదట పేర్లు నమోదు చేసుకున్న 20 మందికి మాత్రమే అవకాశం ఉంటుంది.


పిల్లల కోసం ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి దోహదం

నవచేతన విజ్ఞాన సమితి గవర్నింగ్‌బాడీ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హనుమకొండ చౌరస్తా, మే 20(ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని నవచేతన విజ్ఞాన సమితి గవర్నింగ్‌బాడీ సభ్యుడు తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం హనుమకొండ అశోక కాంప్లెక్స్‌లోని నవచేతన బుక్‌హౌస్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల సందర్భంగా పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుస్తక పఠనంతో మేధో సంపత్తి పెంపొందుతుందని, అందుకే ప్రతి ఒక్కరూ పుస్తకాలను నిరంతరం చదువుతూ ఉండాలని ఆయన కోరారు. నవచేతన బుక్‌హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు మాట్లాడుతూ.. జూన్ నెల 10వరకు ఈ పుస్తక ప్రదర్శన కొనసాగడంతోపాటు అన్ని రకాల పుస్తకాలపై 10శాతం నుంచి 30శాతం వరకు ప్రత్యేక తగ్గింపు ధరలకు అందిస్తుందన్నారు.

ఈ పుస్తక ప్రదర్శనలో వివిధ రకాల పబ్లిషర్స్ రచయితలు, కవులు, రచించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లాలోని విద్యా సంస్థలు, మేధావులు, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగరాజు కోరారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అరసం కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ నారాయణ, సీపీఐ పార్టీ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, నాయకులు ఏదునూరి వెంకట్రాజం, దండు మోహన్, ఎం.డి.ఉస్మాన్‌పాషా, తాండూరి గోపి, పి.కిశోర్‌కుమార్, సిబ్బంది రమేష్, సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

దేశసేవకు వెళ్లి.. విగతజీవిగా ఇంటికి..

నర్సంపేటకు చేరిన నాగరాజు భౌతిక కాయం ● కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు


నర్సంపేటలో నాగరాజు భౌతికకాయం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నర్సంపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్న వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణానికి చెందిన బీఎస్‌ఎఫ్ జవాన్ సంపంగి నాగరాజు(28) సర్వీస్ గన్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆలస్యంగా తెలిసింది. కశ్మీర్‌లోని సాంబా జిల్లా సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్న నాగరాజు తన సర్వీస్ గన్‌తో మూడురోజుల కిందట కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఆర్మీ అధికారులు గోప్యంగా ఉంచడంతో కుటుంబసభ్యులకు ఆలస్యంగా సమాచారం అందింది. మంగళవారం ఉదయం 7గంటలకు జవాన్ భౌతికకాయాన్ని అంబులెన్స్‌లో నర్సంపేటలోని పాకాల రోడ్‌లోని ఆయన స్వగృహంలో కుటుంబ సభ్యులకు అధికారులు అప్పగించారు. ఆకస్మాత్తుగా నాగరాజు విగతజీవిగా రావడంతో ఆయన అతడి భార్య, తల్లిదండ్రులు విజయ- మల్లయ్య, కుటుంబసభ్యుల రోదన పలువురిని కంటతడి పెట్టించింది.

కాగా, నర్సంపేటకు చెందిన విజయ - మల్లయ్య దంపతులకు ముగ్గురు (సాయికుమార్, వెంకటేశ్, నాగరాజు) కుమారులు ఉండగా, చిన్నవాడైన నాగరాజు 2016లో బీఎస్‌ఎఫ్‌లో చేరాడు. ఆయన వివిధ విభాగాల్లోని సెక్టార్లలో 6ఏళ్ల పాటు విధులు నిర్వహించాడు. మూడేళ్లుగా కశ్మీర్‌లోని సాంబా సెక్టార్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, మానసిక ఒత్తిడితో మూడు రోజుల కిందట నాగరాజు సర్వీస్ గన్‌తో కాల్చుకుని మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. అయితే తమ కుమారుడు మూడు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడితే ఆర్మీ అధికారులు వెంటనే సమాచారం అందించలేదని, కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. నాగరాజు మృతదేహానికి హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

కాంగ్రెస్ నాయకులు నివాళి

నాగరాజు భౌతికకాయంపై కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, మాజీ కౌన్సిలర్ ఎలకంటి విజయ్‌కుమార్, ఓర్సు అంజలి, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మాదాసి రవికుమార్, మార్కెట్ డైరెక్టర్ కొల్లూరి మధుకర్, నాడెం నగేశ్, బానాల శ్రీను నివాళులర్పించారు.

తినుబండారాలపై తనిఖీలేవీ?

సోయిలేని ఆహార నియంత్రణ శాఖ అధికారులు

ఇష్టారీతిన వ్యవహరిస్తున్న హోటల్ యజమానులు

అపరిశుభ్రత, కల్తీ ఆహారం తిని రోగాలబారిన ప్రజలు

బాలసముద్రం, మే 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మహానగరంలోని హోటళ్లపై తనిఖీలు కరువై వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆహార పదార్థాల పరిశుభ్రత, కల్తీ నివారణను నియంత్రించాల్సిన అధికారులు సక్రమంగా విధులు నిర్వహించకపోవడంతో వ్యాపారులకు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత రాష్ట్రంలో అతి పెద్ద నగరంగా విరాజిల్లుతున్న వరంగల్ నగరానికి సుదూర గ్రామాల నుంచి వివిధ అవసరాలకు ప్రజలు వేలాదిగా వస్తుంటారు. వారికి ఆకలి వేసినప్పుడు ఆకలి బాధను తీర్చుకోవడానికి హోటళ్లను రోడ్ల వెంట ఆహార పదార్థాలను విక్రయించే వారిని ఆశ్రయిస్తుంటారు. దీంతో నగరవ్యాప్తంగా ఆహార వ్యాపారం జోరుగా సాగుతోంది. వ్యాపారులు లాభాలు ఆర్జించడానికి చవకైన కల్తీ నూనెలు ఆహార దినుసులతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారు. ఆహార పదార్థాల తయారీపై నియంత్రణ కొరవడి వ్యాపారాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు కొద్ది నెలల కిందట నగరంలోని పేరొందిన హోటళ్లలో జరిపిన ఆకస్మిక దాడుల్లో విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. కుళ్లిన మాంసం, కాలం చెల్లిన సుగంధ ద్రవ్యాలు, బూజుపట్టిన కూరగాయలు ఆహార పదార్థాల్లో వినియోగించే విషపూరితమైన రంగులు వెలుగు చూశాయి. పైన పటారం, లోన లొటారం అన్న చందంగా ఉన్నాయి. వినియోగదారులకు ఆహార పదార్థాలను వడ్డించే హాల్ అపరిశుభ్రంగా ఉండి వంటశాలలో శుచి శుభ్రత లేకుండా దుర్వాసన రావడం అధికారులు గమనించారు. పేరొందిన పెద్ద హోటళ్లలోనే పరిస్థితి ఇలా ఉంటే.. ఇక మామూలు సాధారణ హోటళ్లలో పరిశుభ్రత ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇటీవల నగరంలో టాస్క్‌ఫోర్స్ పోలీసు అధికారులు పలు చోట్ల ఐస్‌క్రీమ్ పార్లర్లపై జరిపిన దాడుల్లో కాలం చెల్లిన ఐస్‌క్రీమ్‌లను కనుగొని కేసులు నమోదు చేశారు. కానీ నగరంలో విధులు నిర్వహించే ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎక్కడ తనిఖీలు నిర్వహించిన దాఖలాలు కనిపించక పోవడంతో హోటల్ వ్యాపారానికి ఆటంకం లేకుండా పోయింది. నిత్యం ఆహార పదార్థాల తయారీ, అమ్మకాలపై నియంత్రణ కొనసాగించాల్సిన అధికారులకు ఎందుకు సోయి లేకుండా పోయిందని ప్రజలు వాపోతున్నారు.

పుష్కర జలాలతో నాగేంద్రుడికి అభిషేకం


మల్లెపూల అలంకరణలో పుష్కర పునీతుడైన నాగేంద్రుడు

గీసుగొండ, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊకల్‌లో గల సుప్రసిద్ధ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నాగేంద్రుడికి సరస్వతీ పుష్కర వేడుకలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం త్రివేణి సంగమంలో అంతర్వాహిణిగా ప్రవహిస్తున్న సరస్వతీ నది జలం, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మల్లెపూలతో అలంకరించి ప్రత్యేక అర్చనలు, పూజలు చేశారు. పుష్కర పునీతుడైన నాగేంద్రుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యతో తరలివచ్చి పూజలు చేసి తరించారు. పుట్టలో పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష, ఆలయకమిటీ చైర్మన్ బాబురావు, రాజేందర్, రమేష్, వీరారావు, భక్తులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బస్సుల ఓనర్స్ అసోసియేషన్

ఉమ్మడి జిల్లా కార్యవర్గం


అధ్యక్షుడు లక్కం శ్రీధర్


ప్రధాన కార్యదర్శి అనిల్‌గౌడ్

హనుమకొండ చౌరస్తా, మే 20(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సు ఓనర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా లక్కం శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా పెరుమాండ్ల అనిల్‌గౌడ్ ఏకగ్రీవంగా నియమితులయ్యారు. మంగళవారం హనుమకొండ చౌరస్తా సమీపంలోని ఏనుగుల గడ్డలో ప్రైవేటు బస్సు అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా చింతలపుడి క్రాంతికుమార్, కోశాధికారిగా అనిశెట్టి శ్యామ్, సభ్యులుగా మార్క కోటేష్, కొత్త కిరణ్‌కుమా ర్, పట్నంశెట్టి శైలేష్ ప్రసాద్, ఎం.డి. ఫిరోజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రైవేటు బస్సులకు పన్ను మినహాయింపు కోసం కృషి చేస్తామని తెలిపారు. ప్రైవేటు విద్యా సంస్థల బస్సులను వివిధ శుభాకార్యాలకు వెళ్లకుండా అరికడుతామని వారు తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, మే 20(ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్‌హాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్స్ బాలబాలికల విభాగంలో నిర్వహించనున్న బాక్సింగ్ ఎంపికలో 1 జనవరి 2009 నుంచి 31డిసెంబర్ 2010 సంవత్సర మధ్యకాలంలో జన్మించిన వారు పాల్గొనవచ్చునని ఆయన వెల్లడించారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈనెల 24న మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని రాజేందర్ తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు తమ ఆధార్‌కార్డు, పాఠశాల నుంచి జారీచేసిన బోనఫైడ్ సర్టిఫికెట్, జీడబ్ల్యూఎంసీ నుంచి జారీచేసిన జనన ధ్రువీకరణ పత్రంతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలను వెంట తీసుకొని ఈ నెల 22న డీఎస్ఏ బాక్సింగ్‌హాల్లో ఉదయం 7గంటలకు రిపోర్టు చే యాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ 9959711609 నెంబర్‌లో సంప్రదించాలని రాజేందర్ కోరారు.



108 సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా మేనేజర్ నరేష్

పుష్కరాల్లో విస్తృతంగా 108 సేవలు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి): పుష్కరాల్లో భాగంగా భక్తులకు 108 అంబులెన్స్‌లు విస్తృతంగా సేవలు అందిస్తున్నాయి. ఈ 108 వాహనాలను భక్తుల సౌకర్యార్థం కాళేశ్వరంలోని పీహెచ్‌సీ, వీఐపీ పుష్కరఘాట్, గోదావరి ఘాట్, ప్రధాన ఆలయం, తాత్కాలిక బాస్టాండ్ వద్ద ఐదు ప్రాంతాల్లో ఏర్పాటుచేసి భక్తులకు అత్యవసర వైద్య సేవలను అందిస్తున్నారు. ఇప్పటివరకు మూడు వందల మంది భక్తులకు 108 అంబులెన్స్ ద్వార అత్యవసర వైద్య సేవలను అందించినట్లు జిల్లా మేనేజర్ నరేష్ తెలిపారు. వైద్య సేవలకు కోసం ఫోన్ రాగా ముందుగా రోగులను పీహెచ్‌సీ తరలించిన అక్కడి నుంచి మహాదేవపూర్ సీహెచ్‌సీకి తరలిస్తున్నారు. ఐదు అంబులెన్స్‌లు, 20మంది సిబ్బందితో 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నట్లు జిల్లా మేనేజర్ పేర్కొన్నారు. అలాగే మరో ఐదు బైక్ అంబుటెన్స్‌ల ద్వార సుమారు పది వేల మందికి ఫస్ట్ ఎయిడ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించినట్లు తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌కు అస్వస్థత

సరస్వతీ పుష్కరాల్లో భాగంగా ప్రధాన ఘాట్ వద్ద విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ గోలీకు ఛాతిలో నొప్పి రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అలాగే పుష్కర ఘాట్ వద్ద తీవ్ర అస్వస్థతకు గురైన విజయవాడకు చెందిన కిష్టమూర్తిని, బాలకృష్ణలను 108 వాహనంలో పీహెచ్‌సీకి మెరుగైన చికిత్స నిమిత్తం తరలించారు. పుష్కర ఘాట్ వద్ద మధుమితకు ఫిట్స్ రావడంతో అస్వస్థతకులోనై అపస్మారకస్థితిలోవెళ్లడంతో వరంగల్‌ఎంజీఎంకు తరలించారు.



వీఐపీ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన అగ్నిమాపక వాహనం

నాలుగు అగ్నిమాపక శాఖ సేవలు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి): పుష్కరాల్లో భాగంగా నాలుగు అగ్నిమాపక వాహనాలను అధికారులు అందుబాటులో ఉంచారు. ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో కలిసి సేవలందిస్తున్నారు. చెన్నూర్, భూపాలపల్లి, ములుగు, వరంగల్‌కు చెందిన నాలుగు వాహనాలు సరస్వతీ పుష్కర ఘాట్, ఆలయం వద్ద, హెలిప్యాడ్ వద్ద వీటిని అందుబాటులో ఉంచారు. ఏదైనా అగ్నిప్రమాదం లేక విపత్తు సంభవించినప్పుడు సేవలందించనున్నారు. సుమారు వంద మంది సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారు.

పుష్కరఘాట్ వద్ద పుణ్య స్నానం చేస్తున్న భక్తులు



పుష్కర సరస్వతీ పాహిమాం..

కాళేశ్వరంలో కొనసాగుతున్న భక్తుల తాకిడి

- ఆరో రోజు 50వేల మంది పుణ్య స్నానాలు
- స్వామివారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు
- కొంత మేరకు తగ్గిన ట్రాఫిక్.. సాఫీగా దర్శనాలు..
- పర్యవేక్షిస్తున్న భూపాలపల్లి కలెక్టర్, ఎస్పీ

కాళేశ్వరం, మే 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ నదీ పుష్కరాలకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఎండలను సైతం లెక్కచేయకుండా జనం తరలివస్తున్నారు. ఆరో రోజైన మంగళవారం దాదాపు 50వేల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. పుష్కరాల్లో పలువురు ప్రముఖులు పుణ్య స్నానాలు ఆచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి సృజన, ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, ఐజీ తరుణ్‌జోషి తదితరులు నదిలో పుణ్య స్థానాలు చేసి స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



తగ్గిన ట్రాఫిక్.. సాఫీగా దర్శనాలు..

కాళేశ్వరం పుష్కరానికి వచ్చే భక్తుల సంఖ్య కాస్త తగ్గుముఖం పట్టడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తలేదు. రెండు మూడు రోజులుగా వేలాది మంది భక్తుల రాకపోలతో ట్రాఫిక్‌కు అనే ఇబ్బందులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రద్దీ లేకపోవడంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగాయి. వాహనదారులు పార్కింగ్ స్థల సమీపానికి వెళ్లి దగ్గరలోనే ఉన్న పుష్కరఘాట్‌లో పుణ్య స్నానాలు ఆచరించారు. అలాగే, దర్శనాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న భక్తులకు మంగళవారం కాస్త ఉపశమనం కలిగింది. దర్శనాలకు ఎలాంటి ఇక్కట్లు లేకుండా సాఫీగా సాగాయి.

కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణ

భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్‌ఖరేలు పుష్కరాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం రెండు ఘాట్ల లో తిరుగుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. అటు జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా వాహనాల రాక పోకలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తూ వచ్చారు. అలాగే పుష్కరాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడడం కోసం ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీసీ కెమెరాల ద్వారా పరిస్థితులను సమీక్షిస్తూ పోలీసు అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు సలహాలు అందించారు.

పనుల పరిశీలన

ప్రధానంగా మంగళవారం అష్టమి కావడంతో సాధారణంగానే ఇక్కడ పిండ ప్రదాన కార్యక్రమాలను నిలిపివేస్తారు. అదికాకుండా అష్టమి రోజు ప్రయాణాలు చేయడం అరిష్టంగా భావించే సంప్రదాయం ఉండడం వల్ల చాలామంది దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు రెండు రోజులుగా రావడం లేదని భావిస్తున్నారు. అయితే గురువారం నుంచి భక్తుల సంఖ్య మళ్లీ పుంజుకునే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్న అధికార యంత్రాంగం.. మూడు రోజుల్లో ఉత్పన్నమైన సమస్యలను పునరావృతం కాకుండా చూసేందుకు ముందస్తు చర్యలు ప్రారంభించారు. ముఖ్యంగా సరస్వతీ ఘాట్‌కు వెళ్లే దారిని మరింత విస్తరించి రోలింగ్ చేశారు. భక్తుల రాక వల్ల రోడ్డుపై దుమ్మురేగకుండా ట్యాంకర్ల ద్వారా నీళ్లను కుమ్మరిస్తూ క్యూరింగ్ చేస్తున్నారు.

నవరత్న హారతి లైవ్

పుష్కరాల సందర్భంగా పుష్కర ఘాట్‌లో ప్రతీ రోజూ సాయంత్రం ఇస్తున్న నవరత్న హారతీని లైవ్ ద్వారా ప్రజలు, భక్తులు వీక్షించేందుకు ప్రభుత్వం ఆలోచన చేసింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం నుంచి ఆ కార్యక్రమాన్ని లైవ్‌లో ప్రసారం చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటిం చారు. పుష్కరాలు ముగిసేంత వరకు ఈ కార్యక్రమం కొనసాగించనున్నారు.



ముక్తీశ్వరుడి దర్శనం కోసం క్యూ కట్టిన భక్తులు

స్వల్పంగా పెరిగిన నదీ జలాలు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి) : ఎగువన కురుస్తున్న వర్షాల వల్ల నదీ జలాలు పెరగడంతో సరస్వతి పుష్కర ఘాట్ (త్రివేణి సంగమం) వద్ద జలకళ సంతరించుకుంది. మూడు రోజులతో పోలిస్తే నదిలో ప్రవాహం పెరిగింది. నదిలో ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. రానున్న మూడు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో మరింత ప్రవాహం పెరిగే అవకాశం ఉందని పలువురు బావిస్తున్నారు.

అందుబాటులో ఎలక్ట్రికల్ వాహనాలు

కాళేశ్వరం, మే 20 (ఆంధ్రజ్యోతి) : దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శైలజరామయ్యర్, కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశాల మేరకు తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో మూడు ఎలక్ట్రికల్ వాహనాలు(బగ్గీ)లు అందుబాటులోకి వచ్చాయి. ఈ వాహనాల్లో భక్తులను ఆలయం నుంచి పుష్కర ఘాట్ వద్దకు, పుష్కర ఘాట్ నుంచి తాత్కాలిక బస్టాండ్ వరకు ఉచితంగా చేరవస్తున్నారు. ఇందులో ఒక్కసారి పది మంది వరకు వెళ్లే వెసులుబాటు ఉంది. ఉచితంగా ఏర్పాటు చేయడంపై భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఎలక్ట్రికల్ వాహనంలో భక్తులను తరలిస్తున్న సిబ్బంది

వైభవంగా త్రివేణి సంగమానికి నవరత్న హారతి



హారతి ఇస్తున్న కాశీ పండితులు

తిలకించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి): శ్రీ కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమంలో సరస్వతీపుష్కరాలను పురస్కరించుకుని సోమవారం రాత్రి 7.20గంటల నుంచి 8గంటల వరకు ఏడుగురు కాశీ పండితులు నవరత్న హారతిని వైభవంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక సంగీత నేపథ్యంతో ఓంకార, నాగ, పంచ, సూర్య, చంద్ర, నంది, సింహ, కుంభ, నక్షత్ర హారతులతో కూడిన నవరత్న హారతిని పండితులు నిర్వహించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పలు శాఖల అధికారులు, వందలాది మంది భక్తులు తిలకించారు. సుమారు గంటపాటు నిర్వహించిన నవరత్న హారతి కార్యక్రమంలో ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నవరత్న హారతిని వీక్షిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు, భక్తులు



విద్యలో రాణించాలని సరస్వతి మాతకు మొక్కుతున్న యువతులు



పుష్కరిణికి వడిబియ్యం, సారె సమర్పిస్తున్న భక్తులు

సంచార బయో టాయిలెట్స్ ఏర్పాటు

కాళేశ్వరం, మే 20(ఆంధ్రజ్యోతి): పుష్కరాలకు వచ్చే మహిళలకు సౌకర్యార్థం సంచార బయో టాయిలెట్స్‌ను సరస్వతీ పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన వాహనాన్ని ఘాట్ వద్ద ఏర్పాటు చేశారు. దీంతో మహిళలు విరివిగా సంచార బయో టాయిలెట్స్‌ను వినియోగించుకుంటున్నారు. సంచార బయో టాయిలెట్స్ ఏర్పాటుపై మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



పుష్కర ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సంచార బయో టాయిలెట్ వాహనం

ప్రమాదాలకు ఆస్కారం లేకుండా..

కాళేశ్వరం, మే 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం గోదావరిలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా నివారించడం కోసం అధికార యంత్రాంగం నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఫోర్స్(ఎన్‌డీఆర్ఎఫ్), సింగరేణి రెస్క్యూ బృందాలను, గజ ఈతగాళ్లను పుష్కర ఘాట్‌లో మొహరించింది. ఇప్పటి వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటన లు చోటు చేసుకోలేదు మిగిలిన రోజుల్లో కూడా ఎలాంటి ఇక్కట్లు లేకుండా ఉండేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు చేపడుతోంది.

దేదీప్యమానంగా..

భద్రకాళి చెరువులో 9 ద్వీపాల సుందరీకరణ

- ఇప్పటికే 9 దిబ్బలపై అభివృద్ధి పనులు పూర్తి
- రూ.3కోట్ల 'కుడా' నిధులతో ద్వీపాల అభివృద్ధి పనులు
- దేశ, విదేశాల పక్షులకు ఆశ్రయం కల్పించేలా చర్యలు
- మూడు మార్గాల గుండా కేబుల్ బ్రిడ్జికి ప్రతిపాదనలు

వరంగల్ కార్పొరేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి దేవాలయాన్ని టూరిజం సర్క్యూట్‌గా తీర్చిదిద్దాలన్న రాష్ట్ర ప్రభుత్వం కలలను అధికారులు ఆచరణసాధ్యంగా చేసి చూపిస్తున్నారు. ఐల్యాండ్స్‌తో పాటు భద్రకాళి బండ్‌ను అనుసంధానం చేస్తూ చెరువు మధ్యలో ఉన్న పెద్ద ఐల్యాండ్ (రిలాక్స్ జోన్) వద్దకు కేబుల్ బ్రిడ్జిని కూడా నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నట్టు అధికారులు వెల్లడించారు. భద్రకాళి చెరువు నుంచి పూడితతీత పనులు జరుగుతుండగానే కుడా అధికారులు ప్రత్యేక నిధులతో యుద్ధప్రాతిప దికన ఐల్యాండ్ పనులు పూర్తిచేశారు. భద్రకాళి చెరువు మధ్యలో ఐల్యాండ్ ఏర్పాటు చేయాలని 2007 నుంచి ప్రయత్నిస్తుండగా, తాజాగా భద్రకాళి చెరువు సుందరీకణ కోసం నీటిని ఖాళీ చేసి పూడికతీత పనులు చేపట్టడంతో సాకారమవుతోంది.



పక్షులకు ఆశ్రయం.. ప్రజలకు ఆహ్లాదం..

382 ఎకరాల సువిశాల భద్రకాళి చెరువు మధ్యలో ప్రకృతిసిద్ధంగా వెలిసిన ఒక ద్వీపంతో పాటు మరో 8 ద్వీపాలను కృత్రిమంగా తీర్చిదిద్దారు. ఇందుకు గాను ఇప్పటికే రూ.3కోట్ల వరకు ఖర్చు చేసినట్టు కుడా అధికారులు వెల్లడించారు. 3 ఎకరాల్లో ఒక ద్వీపం నిర్మితమై ఉండగా, మరో 8 ద్వీపాలను 5 నుంచి 20గంటల స్థలంలో ఎత్తైన సిబ్బంలను కేంద్రంగా చేసుకుని చెరువు ప్రాంతాన్ని బట్టి 20 నుంచి 30మీటర్ల ఎత్తులో ఐల్యాండ్స్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కో ద్వీపం తయారు చేయడానికి రూ.30 నుంచి 50 లక్షలు ఖర్చు చేశారు. మొత్తంగా 9 ద్వీపాలను ఏర్పాటు చేసి ఆహ్లాదాన్ని పంచే ప్రయత్నం చేశారు. ద్వీపాలపై ఇతర దేశాల నుంచి దిగుమతి చేసిన ప్రత్యేక గడ్డితో పాటు బిల్వము, జమ్మి, రావి, వేప, మోదుగు, ఉసిరి చెట్లను నాటుతామని తెలిపారు. మరో రూ.50లక్షలతో మొక్కలు కొనుగోలు చేసి వర్షాకాలం ప్రారంభంలో నాటుతారని చెప్పారు. 3 ద్వీపాలకు విద్యుత్ వెలుతురు అలంకరిస్తుండగా మరో 6ద్వీపాలు పూర్తిగా ప్రకృతి పచ్చదనంతో దేశ విదేశాల పక్షులకు ఆవాస కేంద్రంగా రూపొందించనున్నారు.

ముఖ్యమంత్రి సానుకూలంగా ఉన్నారు..

వరంగల్ నగరం అభివృద్ధితో పాటు భద్రకాళి చెరువు పూడికతీత, ద్వీపాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ నిధులు మంజూరు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భద్రకాళి బండ్ నిర్మాణంలో పాటు చెరువు మధ్యలో ఐల్యాండ్స్, పక్షుల పరిరక్షణ, ప్రజల ఆహ్లాదం కోసం ప్రత్యేక ద్వీపాలు ఏర్పాటు చేస్తున్నాం. వర్షాలు కురిసిన తర్వాత ద్వీపాలు ప్రజలకు వీక్షణ కోసం అందుబాటులోకి వస్తాయి. ఇంకా చెరువు మధ్యలోకి వెళ్లేందుకు అధునాతన కేబుల్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

నాయిని రాజేందర్‌రెడ్డి,
వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే

టూరిస్ట్ హబ్

చెరువు మధ్యలో 9 ద్వీపాలు అభివృద్ధి చేసిన అధికారులు.. కేబుల్ బ్రిడ్జిని నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. భద్రకాళి గుడి నుంచి గుట్టకు గుట్ట నుంచి భద్రకాళి బండ్, బండ్ నుంచి మూడు ఐల్యాండ్స్ వద్దకు కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలతో పలుమార్లు సమీక్షలలో చర్చించినట్టు తెలిసింది. ఈ మేరకు అవిభక్త వరంగల్ జిల్లాలో లక్నవరం తర్వాత అతిపెద్ద కేబుల్ బ్రిడ్జి నిర్మాణం భద్రకాళి చెరువు మధ్యలో నిర్మాణం జరుగనుంది. భద్రకాళి దేవాలయం నుంచి చెరువు మధ్యలో ఉన్న (రిలాక్స్ జోన్) ఐల్యాండ్ వరకు సుమారు 600 నుంచి 700 మీటర్ల పొడవులో కేబుల్ బ్రిడ్జి నిర్మిస్తే చెరువుతో పాటు ద్వీపప్రాంతమంగా టూరిస్ట్ హబ్‌గా మారు తుందని పలువురు చెప్పుకొస్తున్నారు. అయితే ఐల్యాండ్ డెవలప్‌మెంట్ పనులు భద్రకాళి దేవాలయం, మాఢవీధులు, భద్రకాళిబండ్‌ను అనుసంధానం చేస్తూ కేబుల్ బ్రిడ్జి నిర్మాణం చేస్తే ప్రజలకు, టూరిస్టులకు అనుకూలంగా ఉంటుందని మరికొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరి కొన్నిరోజుల్లో భద్రకాళి చెరువు ద్వీపాలు పర్యాటక ప్రాంతాలుగా కనువిందు చేస్తాయి.

కేబుల్ బ్రిడ్జి నిర్మాణం జరిగే వరకు ఆహ్లాదకారులు ద్వీపాల వద్దకు బోట్స్ రైడింగ్ ద్వారా వెళ్లి రావచ్చని తెలిపారు.

2005లో ద్వీపం గుర్తింపు

భద్రకాళి చెరువులో గతంలో నీరు ఇంకిపోయిన సమయంలో చెరువు స్వభావం, స్వరూపం కనిపించేది. 2005లో చెరువు మధ్యలో సుమారు 3 నుంచి 5ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ద్వీపాన్ని అప్పటి అధికారులు గుర్తించారు. ద్వీపం దిబ్బను శుభ్రం చేసి తవ్విచూడగా ప్రాచీన శిల్పాలు, ఆయుధ కర్మాగారం ఉన్నట్టు ప్రాచీనకారులు గుర్తించారు. అంతేకాకుండా ఈ ద్వీపంపై ఆదిమానవులు జీవించినట్టు ఆధారాలు లభించినట్టు చెప్పారు. దిబ్బను ద్వీపంగా మార్చడంతోపాటు ధ్యానం చేయడానికి ప్రత్యేక మందిరం, కేబుల్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కుడా అధికారులు నిర్ధారణకు వచ్చారు. అనుకున్నదే తడవుగా భద్రకాళి దేవాలయం నుంచి చెరువు మధ్యలో ఉన్న దీపం వద్దకు వెళ్లేందుకు కేబుల్ బ్రిడ్జి నిర్మాణం కోసం 2007లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకుగాను రూ.2కోట్ల నిధులు కేటాయించారు. ధ్యాన మందిరం అభివృద్ధి పనులకు మరో రూ.3కోట్లు ఖర్చు అవుతుందని డీపీఆర్‌లు సిద్ధం చేసి అప్పటి ప్రభుత్వానికి పంపగా మంజూరుకాలేదు. అలాగే 365 రోజుల పాటు చెరువు నిండా నీరు ఉండడంతో ఐల్యాండ్ కలగా మారింది.

బాధితులకు తక్షణ సాయం అందించాలి

● ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : భరోసా సెంటర్‌కు వచ్చిన వారికి అన్నిరకాల సహాయ సహకారాలు, అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక సాయం అందించామని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. భరోసా సెంటర్ ఏర్పడి మూడు సంవత్సరాలు కావొస్తున్న సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భరోసా సెంటర్ ఏర్పడి మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భరోసా తరుపున నలుగురు బాధితులకు తక్షణ సాయం కింద రూ.30 వేలు అందించామన్నారు. భరోసా సెంటర్ ద్వారా అందించే సేవలను ఎస్సై ఝాన్సీ, షీటీమ్ ఎస్సై సునంద, భరోసా సిబ్బంది ఎస్పీ అభినందించారు. డీఎస్పీ తిరుపతిరావు, ఎస్బీ సీఐ చంద్రమౌళి, టౌన్, రూరల్ సీఐలు దేవేందర్, సర్వయ్య, ఎస్సై దీపిక, డీడబ్ల్యూవో ధనమ్మ, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, భరోసా సిబ్బంది జ్యోత్స్న, సాహిత్య, జయశ్రీ, దేవి, పార్వతి, రేణుక, మౌనిక, సఖి టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా బోధన చేయాలి

● డీఈవో రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : తరగతుల వారీగా విద్యార్థుల సామర్థ్యాలను పెంపొందించేలా బోధనచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు 14 మండల కేంద్రాల్లో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల రెండవ విడత శిక్షణ శిబిరాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాలను డీఈవో రవీందర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా డీఈవో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థుల



ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని వారిని ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడిపై ఉందన్నారు. పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాలను బోధించడంతో పాటు సామాజిక అంశాలపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నత విద్యనభ్యసించడంతో పాటు అనుభవం, అంకితభావం కలిగి ఉన్నారని పేర్కొన్నారు. రాబోయే విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదుశాతం పెంచేందుకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసించిన పదవ తరగతి విద్యార్థులు సాధించిన ఉత్తమ ఫలితాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయ శిక్షణలో రిసోర్సు పర్సన్‌లు బోధనలో ఏ విధమైన మెళకువలు పాటించాలనే అంశాలపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు సూక్ష్మ, అభ్యసన సామర్థ్యాలు, అభ్యసన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు బోధించాలని పేర్కొన్నారు. ఆయా శిక్షణ శిబిరాల్లో ఎంఈవోలు బాలాజీ, లచ్చిరాం, ఏసీజీఈ మందుల శ్రీరాములు, డీఎస్వో అప్పారావు, కో-ఆర్డినేటర్లు ఆజాద్‌చంద్రశేఖర్, సంతోష్, సతీష్, పూర్ణచందర్, డీఆర్పీలు, ఎమ్మార్పీలు పాల్గొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

మహబూబాబాద్ క్రైం, మే 20 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహం చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. కురవి మండలం నేరడ శివారు చీమ్లాతండాకు చెందిన ఓ యువకుడితో ఈనెల 19న శనిగపురం గ్రామ శివారు పాతతండాకు చెందిన ఓ బాలికతో వివాహం జరిపించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంచాల భవాని మహబూబాబాద్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎస్సై దీపికరెడ్డి మైనర్ బాలిక తల్లిదండ్రులు, యువకుడి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మిక సంఘం నాయకుడు రాజన్న

మరిపెడ, మే 20 (ఆంధ్రజ్యోతి) : కార్మిక, కర్షక, నిరుపేదల హక్కులను కాలరాస్తున్న పాలకుల విధానాలపై ఉద్యమించాలని వ్యవసాయ, కార్మిక సంఘం నాయకుడు బాణాల రాజన్న పిలుపునిచ్చారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో తిరోగమనం ప్రారంభమైందన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కందాల శ్రీను, యశ్వంత్, నరేష్, పవన్, సొహైల్, సీఐటీయూ నాయకులు ఎర్ర వెంకన్న, కావెళ్ల వెంకన్న, మమత పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఐదు రోజుల శిక్షణ తరగతులను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి జె.రవికుమార్ అన్నారు. గూడూరు మండల కేంద్రంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు అందించే బోధనలో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయుల హాజరు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సెకండ్‌గ్రేడ్ టీచర్లు, ఎమ్మార్పీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

బెస్ట్ అవెలబుల్ స్కీంలో ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 2025-26 విద్యాసంవత్సరానికి బెస్ట్ అవెలబుల్ స్కూల్ (రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్) పథకంలో భాగంగా ఉత్తమ పాఠశాలల ఎంపికకు ఈ నెల 26 వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నరసింహస్వామి మంగళవారం తెలిపారు. జిల్లాలోని ఆంగ్లమాధ్యమ పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 1వ తరగతి విద్యార్థులు (నాన్ రెసిడెన్షియల్) పథకం క్రింద 5వ తరగతి విద్యార్థులు(రెసిడెన్షియల్) పథకంలో డ్రా పద్ధతి ద్వారా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆధ్వర్యంలో ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. బెస్ట్ అవెలబుల్ స్కూల్ రెసిడెన్షియల్ పథకంలోని 5వ తరగతి విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్ వసతి, భోజన వసతితో పాటు రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలకు గాను ప్రతీ విద్యార్థికీ రూ. 42 వేల చొప్పున చెల్లించడం జరుగుతుం దన్నారు. బెస్ట్ అవెలబుల్ స్కూల్ (నాన్‌రెసిడెన్షియల్) పథకంలో భాగంగా 1వ తరగతి విద్యార్థులకు ట్యూషన్, హాస్టల్ వసతి, భోజన వసతితో పాటు రెండు జతల దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలకు గాను ప్రతి విద్యార్థికీ రూ.28 వేల చొప్పున చెల్లించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు ఫారముల కొరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి కార్యాలయంలో ఈనెల 20 నుంచి ప్రతీ రోజు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ఆంగ్లమాధ్యమ ప్రైవేటు పాఠశాలలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎర్రబెల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

● పీఎస్‌లో ఝాన్సీరెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు

తొర్రూరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుపై కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం తొర్రూరులోని ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ సంస్థాగత సన్నాహక సమావేశంలో ఎదయాకర్ రావు అంతుచూస్తా అని ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి అనడం సరికాదన్నారు. 40 సంవత్సరాల సుదీర్ఘ అనుభవం ఉన్న ప్రజానేత దయాకర్‌రావు అని అన్నారు. ఝాన్సీరెడ్డికి భారత పౌరసత్వం లేకున్నా ఇక్కడే ఉంటూ అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నంతమాత్రాన అధికారిక కార్యక్రమాల్లో ఝాన్సీరెడ్డి ఎలా పాల్గొంటారని ప్రశ్నించారు. అధికారులు కాంగ్రెస్ కార్యకర్తలుగా మారారని



ఠాణాలో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఝాన్సీరెడ్డిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సీతారాములు, సుందర్ రామ్‌రెడ్డి, ఎం.శ్రీనివాస్, శ్రీనివాసరావు, ఐలయ్య, గాంధీనాయక్, అనిమిరెడ్డి, అంకుష్, ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

ఇనుగుర్తి, మే 20 (ఆంధ్రజ్యోతి) : నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఇనుగుర్తి అంబేద్కర్ సెంటర్‌లో మంగళవారం ఆ సంఘం మండల కార్యదర్శి జల్లె జయరాజ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనేక ఏళ్ల పోరాటం చేసి కార్మికులు సాధించుకున్న హక్కులను హరించి వేస్తూ నాలుగు కోడ్‌లను కేంద్రం రూపొందించిందని, వీటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బూర యాదలక్ష్మి, జి.యాకమ్మ, బి.సుగుణ, పి.ఉమ, ఎం.ఇద్దమ్మ, ఇ.సమ్మక్క, ఎల్లమ్మ, బిక్షం, పార్వతమ్మ, దర్గయ్య, దేవేంద్ర పాల్గొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

మహబూబాబాద్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలను వారంలోపు ఇవ్వకపోతే ఈనెల 27 నుంచి కార్మికులు పనులు నిలిపివేయాల్సి వస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు అన్నారు. కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మానుకోట మునిసిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ అనుబంధ తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, కుమ్మరికుంట్ల నాగన్న, సమ్మెట రాజమౌళి, తోట శ్రీనివాస్, కాంపెల్లి శ్రీనివాస్, ఎర్ర శ్రీను, విజయ్, పుష్పరాజ్, చిరంజీవి, ఆవుల వీరన్న, సుజాత, లక్ష్మి, గడ్డం ఎల్లయ్య, వెంకన్న, అమృత, పద్మ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

కేసముద్రం, మే 20 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాలలో కేసముద్రం, ఇనుగుర్తి మండలాల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఐదు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఎంఈవోలు కాలేరు యాదగిరి, జంగా రూపారాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 158 మంది ఉపాధ్యాయులకు వివిధ విషయాలపై మౌళిక భాషాగణిత సామార్థ్యాల సాధన(ఎఫ్ఎల్ఎన్)పై శిక్షణ ఇస్తారని ఎంఈవోలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్పీ కే.సారంగం, ఎంఆర్పీలు గనె యాదగిరి, బొరిగం రాములు, ఏదునూరి అశోక్, ఎన్నం భాస్కర్, వెలమల భాస్కర్, పట్నాల సత్యనారాయణ, మేకల సురేష్‌నాయుడు, జి.మోహనకృష్ణ, ఘనపురం కృష్ణ, ఎస్.భాస్కర్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ షేక్ ఖాదర్ పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం రాస్తారోకో

కేసముద్రం, మే 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ తాళ్లపూసపల్లిలో మంగళవారం సీపీఎం అనుబంధ వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల మండల కార్యదర్శులు గొడిశాల వెంకన్న, నీరుటి జలెందర్ మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో రోజుకు రూ.600 వేతనం వచ్చే విధంగా ఏటా 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తులసిమొగ్గ శేఖర్, వెంకన్న, దొంతరబోయిన సరిత, మల్లెల సుగుణమ్మ, బాధ కళావతి, బుద్ధరం నర్సమ్మ, గొడుగు మునిత, ఉమ పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు

కేసముద్రం, మే 20 (ఆంధ్రజ్యోతి) : రైతులు శాస్త్రవేత్తల సలహాలతో మేలైన యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్.మాలతి సూచించారు. కల్వలలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు రాంబాబు, క్రాంతికుమార్, ఎంఏవో బి.వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

డోర్నకల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం తీసుకురావాలని భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ సీఐ రాజేష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. డోర్నకల్ మండలం బూరుగుపాడుకు చెందిన మాధవి చిల్కోడుకు చెందిన బంక నాగేష్ ఐదేళ్ల క్రితం కుటుంబసభ్యులు, బంధువుల సమక్షంలో వివాహం జరిగింది. కొంతకాలం సాఫీగా సాగిన వారి కాపురంలో వారికి పాప జన్మించింది. ఆ తర్వాత మాధవిని భర్త నాగేష్, మామ శ్రీనివాసరావు, అత్త లావణ్య అదనపు కట్నం తీసుకురావాలని వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయాన్ని మాధవి తల్లిదండ్రులకు చెప్పింది. వారు పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టించి అత్తింటి వారిని మందలించారు. అయినప్పటికి అతను ఇవేమి పట్టించుకోకుండ మళ్లీ అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో వారి వేధింపులు తాళలేక మాధవి డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లోఫిర్యాదు చేసినట్లు చెప్పారు. మాధవి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

పెద్దవంగర, మే 20 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఉపాధ్యా యులు వృత్తినైపుణ్యాలు పెంపొందించుకోవాలని జిల్లా రిసోర్స్ పర్సన్ రాకేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులకు వేసవి సెలవుల్లో వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల విద్యబోధన పటిష్టం చేయడం, ముఖ్యంగా తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఈవీఎస్ సబ్జెక్టులపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తయారీ, ఏఐ (కృత్రిమమేధ) వినియోగం వంటి వాటిపై శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈనెల 24 వరకు శిక్షణ కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఆర్పీలు మధుసూదన్‌రెడ్డి, హరిసింగ్, సత్యనారాయణ, కవిరాజు, శ్రీకాంత్, శ్రీనివాస్, యాకూబ్‌పాషా, ఉపాధ్యాయులు, సీఆర్పీలు నిరంజన్, సంతోష్, రమాదేవి, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

వడ్ల కొనుగోలు కేంద్రాలకు కంట్రోల్ రూం ఏర్పాటు

అగ్రికల్చర్, మే 20 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లు, రవాణా, తదితర అంశాలపై కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాల మేరకు రైతుల సౌకర్యార్థం ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్ కుమార్, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ కృష్ణవేణి తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో వారు మాట్లాడారు. రైతుల సౌకర్యార్థం ఏర్పాటైన టోల్ నెంబర్ కంట్రోల్ రూంలో షిఫ్టుల వారీగా సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడిన, కొనుగోళ్ల సమస్యలు వచ్చినా.. వెంటనే టోల్ నెంబర్ 79950 50789లో అధికారులను సంప్రదించాలన్నారు. వెంటనే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు.

కరెంట్ గోస తీర్చుతున్న మంత్రి సీతక్క

● యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాజు

కొత్తగూడ, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఇందిర సౌర గిరి జల వికాసం పథకంతో పంచాయతీరాజ్ శాఖమంత్రి సీతక్క రాష్టంలోని గిరిజనుల విద్యుత్ గోసను తీర్చుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ ప్రధాన కార్యదర్శి గొంది రాజు అన్నారు. కొత్తగూడలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిర సౌరగిరి జల వికాసం పథకంతో గిరిజనుల జీవితాల్లో సువర్ణాధ్యాయం మొదలవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 2లక్షల 30వేల 735 మంది గిరిజన రైతులకు 6.69 లక్షల ఎకరాలకు భూ యాజమాన్యపు హక్కు కల్పించారని పేర్కొన్నారు. రాబోవు 5 సంవత్సరాల్లో రూ.12 వేల 600 కోట్లతో సౌర విద్యుత్‌తో సాగునీటి సౌకర్యం కల్పిస్తుందని పేర్కొన్నారు. బిందు సేద్యానికి, ఉద్యానవన పంటలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఈక కృష్ణ, ఈక కిట్టు, అల్లెం మహేందర్, బండ నరేష్, ఈసం నాగేష్, పుల్సం మధుకర్, అల్లెం వినోద్, మద్దెల చంద్రశేఖర్, మద్దెల శరత్. జాడీ ప్రవీణ్, ఈక రాజు పాల్గొన్నారు.

వీరభద్రుడి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కురవి, మే 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్-సీతామహాలక్ష్మి దంపతులు కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు. శంకర్‌నాయక్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

ఎన్నికల నోటిఫికేషన్‌ను ఆమోదించాలి

డోర్నకల్, మే 20 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ రైల్వే జంక్షన్‌లోని రైల్వే ఇనిస్టిట్యూట్ ఎన్నికల నోటిఫికేషన్‌ను వెంటనే ఆమోదించాలని మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ రవీందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డోర్నకల్ రైల్వే జంక్షన్‌లోని ఏడీఎన్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ రైల్వే ఇనిస్టిట్యూట్ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఏప్రిల్ 29న జారీ చేసినట్లు చెప్పారు. మే 15వ తేదీన నామినేషన్ వేసే తుది గడువు ముగిసిందని, ఇందులో మజ్దూర్ యూనియన్ తరుపున వేసిన నామినేషన్‌ను ఏకగ్రీవంగా ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకే నామినేషన్ దాఖలు చేసిన అధికారులు నిబంధనల ప్రకారం ఏకగ్రీవం చేయకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి నిరవధికంగా నిరసన చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గడువులోగా వచ్చిన నామినేషన్‌ను ఆమోదించేంత వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ డోర్నకల్ బ్రాంచ్ చైర్మన్ చరణ్‌నాయక్, సెక్రటరీ అంజియాదవ్, వరంగల్ బ్రాంచ్ సెక్రటరీ యుగంధర్, కాజీపేట బ్రాంచ్ సెక్రటరీ సమ్మయ్య, రాజేందర్, జమ్మికుంట, మధిర బ్రాంచ్ చైర్మన్లు శ్రీనివాస్, సంపత్, నాయకులు జాని, బిక్షపతి, కరణ్‌సింగ్, నాగేషు, సుందరయ్య, శ్రీనివాస్, రమేష్‌బాబు, శేఖర్, కృష్ణ, బాబు పాల్గొన్నారు.

కొనుగోలులో జాగ్రత్తలను పాటించండి

గంగారం, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది వ్యవసాయ సీజన్‌లో విత్తనాలు కొనుగోలు విషయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని రైతులను సూచించారు. మంగళవారం గంగారం రైతు వేదికలో జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో మాట్లాడారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని కొందరు నకిలీ వ్యాపారులు ఎటువంటి లైసెన్సులు లేకుండా నేరుగా ఇండ్లకు వచ్చి విత్తనాలు అమ్మే వారి వద్ద కొనుగోలు చేయరాదన్నారు. వ్యాపారుల వద్ద కొనే విత్తనాలకు బిల్లులు తీసుకుని పంటకాలం పూర్తయ్యే వరకు జా గ్రత్త పర్చుకోవాలన్నారు. వ్యాపారులు ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయిస్తే వ్యవసాయ అధికారులకు ఫిర్యాదులు చేయాలని కోరారు. వేసవిలోనే వర్షాలు కురుస్తున్నందున పొడి దుక్కులు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఏఈవోలు కిషోర్‌కుమార్, ధర్మేష్, రెడ్యాపాల్గొన్నారు.

జిల్లాలో ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే20 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఈనెల 6న ప్రారంభమైన వేసవి శిక్షణ శిబిరాలు మంగళవారంతో ముగిశాయి. 6 నుంచి ప్రతీ రోజు ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేందుకు 15 రోజుల పాటు శిక్షణ శిబిరాలను నిర్వహించారు. జిల్లాలోని 18 మండలాల పరిధిలో 50 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఒక్కో పాఠశాలకు రూ. 50 వేల చొప్పున నిధులు మంజూరు చేసి శిక్షణ శిబిరాలను నిర్వహించింది. ఈ శిక్షణ శిబిరాల్లో వ్యాయామం, మెడిటేషన్, బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్, యోగా, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్, ఇండోర్ గేమ్స్, గణితం స్కిల్స్, పెయింటింగ్, డ్రాయింగ్, ఫిజిక్స్ ఎక్స్‌పర్‌మెంట్స్ తయారీ, క్రియేటివిటీ, టాస్క్, హిందీ, తెలుగుపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. వేసవి శిక్షణ శిబిరాల ముగింపు వేడుకల్లో విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి



పూలే విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

తొర్రూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): లేబర్‌కోడ్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులతో కలిసి తొర్రూరులోని పూలే విగ్రహం వద్ద ధర్నాలో వారు మాట్లాడారు. కోట్లాది మంది కార్మిక వర్గానికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు చెప్పినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సరి కాదన్నారు. 45 కోట్ల మంది కార్మికుల హక్కులను హరిస్తూ బహుళజాతి కంపెనీల లాభాల కోసం తీసుకువచ్చిన లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దుచేయాలన్నారు. జూన్ 9న నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఓమ బిక్షపతి, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి, ఎండీ యాకూబ్, బంధు మహేందర్, శ్రీను, లక్ష్మణ్, యాకయ్య, కార్మికులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం వీడాలి

నెల్లికుదురు మే 20 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్ల తరలింపులలో ప్రభుత్వం విఫలమైందని అఖిల భారత ఐక్య రైతుసంఘం తొర్రూరు డివిజన్ కార్యదర్శి జక్కుల యాకయ్య తెలిపారు. మేచరాజుపెల్లిలో సంయుక్త కిసాన్ మోర్చా విడుదల చేసిన కరపత్రాన్ని మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దొడ్డ కేశవులు, తోట రవీందర్, సైదులు వీరన్న, వెంకన్న, యాకయ్య, లక్ష్మీ, వెంకటమ్మ పాల్గొన్నారు.

సదా మీ సేవలో
దమ్మున్న వార్తలతో అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితే చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు. పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు. మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు.
మహబూబాబాద్ (ఏ.సీ.ఓ) 9985432327
మహబూబాబాద్ (ఎస్.ఆర్) 9491825628
తొర్రూర్. (ఎస్.ఆర్) 8500585626
డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్, ఖమ్మం 9985411350
బ్రాంచ్ మేనేజర్ ఖమ్మం

కాలంతో పరుగెడితే భవిష్యత్ బంగారుమయం

● మానుకోట మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

మహబూబాబాద్ టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి) :విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కాలంతో పరుగెడితే అనుకున్న లక్ష్యాలను సాధించి భవిష్యత్ ను బంగారుమయంగా చేసుకోవచ్చని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ శ్రేణుల సమక్షంలో మంగళవారం శంకర్‌నాయక్ జన్మదినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన జన్మదిన కేక్‌ను కట్ చేశారు. అనంతరం పదవ తరగతిలో నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన టాపర్లకు నగదు బహుమతిని అందించి శాలువాలతో సత్కరించి మెమెంటోలను బహుకరించారు. అనంతరం మదర్‌థెరిసా సెంటర్‌లో మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ ఎమ్డీ.ఫరీద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో శంకర్‌నాయక్ సతీమణి సీతామహాలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, బీఆర్ఎస్ నాయకులు యాళ్ల మురళీధర్‌రెడ్డి, చిట్యాల జనార్దన్, సుధగాని మురళీ, లూనావత్ అశోక్‌నాయక్, నర్సింగం వెంకన్న, రామరాజు యాకన్న, కత్తుల ఎలెందర్, సలీం, బూర్ల ప్రభాకర్, బోడ పృథ్వీరాజ్, అంగోతు కిషన్, నీలేష్ రాయ్, నర్సింహానాయక్, దాసరి రావిష్, నవీన్, యాకంతం, కవిత పాల్గొన్నారు.

● గూడూరు, (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో శంకర్‌నాయక్ జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేం వెంకటకృష్ణారెడ్డి, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఖాసీం, వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, బానోత్ మోతీలాల్, కటార్‌సింగ్, సంపత్‌రావు, భూక్య సురేష్, రహీం, చీదురు వెంకన్న, బోడ కిషన్, బోడ ఎల్లయ్య, బానోత్ నర్సింహానాయక్, కోడి రవి, నూకల సురేందర్, రమేష్ పాల్గొన్నారు.

● నెల్లికుదురు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంకేఆర్ గార్డెన్‌లో బానోత్ శంకర్‌నాయక్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. డాక్టర్ సీతామాలక్ష్మీ, పరిపాటి వెంకట్‌రెడ్డి, మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్‌రెడ్డి, గుగులోత్ బిక్కునాయక్, చిర్ర యాకంతం గౌడ్, బత్తిని అనిల్, కస్తూబోయిన విజయ్ యాదవ్, ఆకుల జగ్గయ్య, వెన్నాకుల శ్రీనివాస్ ఆదిరెడ్డి పులి రామచంద్రు, వీరగాని మల్లేశం, వరిపెల్లి వెంకటేష్, వీరన్న కొమ్మినేని సందీప్, మంద అశోక్, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న బానోత్ శంకర్‌నాయక్